గుంతలమయంగా బీటీ రోడ్లు

- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు, ప్రయాణికులు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు


గుంతలమయంగా ఉన్న పోలుమల్ల బీటీ రోడ్డు


మద్దిరాల - ముకుందాపురం రోడ్డు

మద్దిరాల : మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే బీటీ రోడ్లు గుంతలమయంగా మారాయి. దీంతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో ముఖ్యంగా మండల కేంద్రం నుంచి ముకుందాపురం, అదే విధంగా పోలుమల్ల నుంచి చందుపట్ల వరకు వెళ్లే బీటీరోడ్డు గుంతలమయంగా మారింది. ఈ రోడ్లపై నిత్యం రద్దీ ఎక్కువగా ఉంటుంది. కానీ రోడ్లు సరిగా లేకపోవడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు.

నిధులు మంజూరైనా ప్రారంభించని పనులు..

ఇటీవల ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ మండలంలోని మద్దిరాల నుంచి ముకుందాపురం వరకు రూ.2.55కోట్లతో, పోలుమల్ల నుంచి చందుపట్ల గ్రామానికి రూ.1.33కోట్లతో నూతన బీటీరోడ్డు మంజూరు చేయించారు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. కానీ ఇంత వరకు పనులు మొదలు పెట్టకపోవడంతో అసహనం వ్యక్తం చేస్తున్నారు. పోలుమల్ల గ్రామస్తులు గ్రామం నుంచి 365 జాతీయ రహదారి వైపు రావాలంటే నరకయాతన పడుతున్నారు. ఇటీవల వర్షాలు విపరీతంగా కురుస్తుండడంతో ఇంకా బీటీ రోడ్లపై గుంతలు ఎక్కువై వర్షం నీరు నిలుస్తోంది. ఎక్కడ గుంతలు ఉన్నాయో తెలియక రాత్రి సమయంలో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. నడవడానికి కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బీటీరోడ్డు పనులను వెంటనే ప్రారంభించాలని, సమస్యలను పరిష్కరించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

బీటీరోడ్డు పనులు ప్రారంభించాలి



మండలంలోని 365 జాతీయ రహదారి నుంచి పోలుమల్ల గ్రామానికి వెళ్లే ప్రధాన బీటీరోడ్డు తీవ్రంగా దెబ్బతిన్నది. రోడ్డుపై భారీ గుంతలు ఏర్పడ్డాయి. దీంతో ప్రయాణికులు, వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి నూతనంగా మంజూరైన బీటీరోడ్డు పనులను వెంటనే ప్రారంభించి సమస్య పరిష్కరించాలి.

– గంగధరి హరీష్, పోలుమల్ల

ప్రభుత్వ పథకాలపై కళాజాతా


కళాజాతా నిర్వహిస్తున్న కళాకారులు

అర్వపల్లి : ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారుల జిల్లా టీం లీడర్ మేడిపల్లి వేణు కోరారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, హరిత హారం, సీజనల్ వ్యాధులపై తెలంగాణ సాంస్కృతిక సారథి ఆధ్వర్యంలో కుమ్మరిగూడెంలో శుక్రవారం ఆటపాటల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాకారులు వెన్నెల నాగరాజు, గడ్డం ఉదయ్, పాలకుర్తి శ్రీకాంత్, పాక ఉపేందర్, పల్లెల రాము, లక్ష్మణ్, మంజుల, నాగలక్ష్మి, శిరీష, ప్రియాంక, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రశ్నించే వారిపై దాడులు చేయడం తగదు

నాగారం : తుంగతుర్తి నియోజకవర్గంలో అధికార పార్టీ అవినీతి, అరాచకాలను ప్రశ్నించే వారిపై బీఆర్ఎస్ నాయకులు దాడులకు పాల్పడటం తగదని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లేపాక సాయిబాబా అన్నారు. శుక్రవారం నాగారం మండల కేంద్రంలోని రహదారి బంగ్లాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల ఫణిగిరి గ్రామంలో హత్యకు గురైన అల్లయ్య కుటుంబానికి ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా చెల్లించి ఆదుకోవాలని కోరారు. ఈ సమావేశంలో బీజేపీ మండల అధ్యక్షుడు మొల్కపురి చిరంజీవి, జిల్లా కార్యవర్గసభ్యుడు నాగు వెంకన్న, యువ మోర్చా మండల అధ్యక్షుడు పడమటి గిరిప్రసాద్, అర్జున్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఆదేశాలు వెనక్కి తీసుకోవాలి

దురాజ్‌పల్లి: విద్యార్థి సంఘాలకు, మీడియాకు విద్యాసంస్థల్లోకి అనుమతి లేదనే ఆదేశాలను వెనక్కి తీసుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎర్ర అఖిల్ కుమార్ డిమాండ్ చేవారు. ఒక పక్క విద్యాసంస్థల్లో ఆత్మహత్యలు, ర్యాగింగ్, వేధింపులు, ఫీజుల దోపిడీ జరుగుతుంటే విద్యార్థి సంఘాలను, మీడియాను రావొద్దనడంలో అంతర్యం ఏమిటని ప్రశ్నించారు. ఇలాంటి దుర్మార్గమైన ఆలోచనలను మానుకోవాలని హెచ్చరించారు. లేకుంటే ఆందోళనలు నిర్వహిస్తామని తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


మురుగులో ఆయిల్ బాల్స్ వేస్తున్న వైద్యసిబ్బంది

అర్వపల్లి : సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి డాక్టర్ ఎస్‌కే. హర్షద్ కోరారు. మండల పరిధిలోని కుంచమర్తి గ్రామంలో శుక్రవారం మురుగు గుంతలు, నీరు నిలువ ఉన్న ప్రదేశాల్లో ఆయిల్‌బాల్స్ వదిలారు. దోమలు ఉండకుండా చూసుకోవాలని సూచించారు. ఈ సీజన్‌లో వచ్చే వ్యాధుల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ ఎల్. చరణ్, పంచాయతీ కార్యదర్శి ఎ.రవీందర్‌రెడ్డి, హెల్త్ అసిస్టెంట్‌లు కుంభం వీరయ్య, తప్పెట్ల నాగరాణి పాల్గొన్నారు.

వైభవంగా పీర్ల ఊరేగింపు


తుంగతుర్తి : పీర్లను ఊరేగిస్తున్న భక్తులు


అర్వపల్లి : బొల్లంపల్లిలో..

తుంగతుర్తి : మతసామరస్యానికి ప్రతీక మొహర్రం అని డీసీసీబీ డైరెక్టర్ గుడిపాటి సైదులు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన పీర్ల ఊరేగింపులో పాల్గొని మాట్లాడారు. అనంతరం వెలుగుపల్లి గ్రామానికి చెందిన పీర్ల నిర్వాహకులకు రూ.5వేలు విరాళం అందించారు.

అర్వపల్లి : మండల పరిధిలోని బొల్లంపల్లి గ్రామంలో శుక్రవారం పీర్ల ఊరేగింపును గ్రామస్తులు వైభవంగా నిర్వహించారు. వివిధ పేర్లతో పిలువబడే పీర్లను వీధుల్లో ఊరేగించారు. పీర్లకు భక్తులు మొక్కలు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ముస్లింలు, నిర్వాహకులు పాల్గొన్నారు.

ఆకస్మికంగా హాస్టల్ భవనం మార్పిడి

- ఆందోళనలో విద్యార్థినులు


హాస్టల్ ఎదుట నిరసన తెలుపుతున్న విద్యార్థినులు


ట్రాక్టర్‌లో సామగ్రిని తరలిస్తున్న సిబ్బంది

దురాజ్‌పల్లి : గత కొన్ని సంవత్సరాలుగా కొనసాగుతున్న హాస్టల్‌ను సమాచారం లేకుండా మార్చడంతో అందులో వసతి పొందుతున్న విద్యార్థినులు దిక్కుతోచని స్థితిలో పడ్డ సంఘటన శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో నెలకొన్నది. పట్టణంలోని శ్రీరాంనగర్‌లో కొనసాగుతున్న బీసీ బాలికల ప్రిమెట్రిక్ హాస్టల్‌ను అధికారులు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా మరో భవనంలోకి మార్చుతుండటంతో విద్యార్థినులు హాస్టల్ ఎదుట నిరసనకు దిగారు. ప్రభుత్వ పాఠశాలలలో చదువుతున్న విద్యార్థులు లేనందున వసతి గృహాన్ని మార్చాలని నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలుపుతున్నారు. కానీ ఈ విద్యాసంవత్సరం ప్రారంభమైన నాటి నుంచి కొత్త అడ్మిషన్లు తీసుకోకుండా హాస్టల్ వార్డెన్ కావాలనే ఇతర హాస్టల్‌కు విద్యార్థులను పంపిందనే ఆరోపణలు ఉన్నాయి. అంతే కాకుండా వార్డెన్ విధులకు సక్రమంగా హాజరు కావడం లేదని, తమకు భోజనం అందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఇటీవల విద్యార్థినులు జిల్లా బీసీ అభివృద్ధి అధికారికి ఫిర్యాదు చేసినట్లు సమాచారం. దీంతో తమపై కక్షసాధింపుగా హాస్టల్ భవనాన్ని మార్చేందుకు నిర్ణయించిందని విద్యార్థినులు తెలుపుతున్నారు. ఈ విద్యా సంవత్సరం పూర్తయ్యే వరకు ఇక్కడే హాస్టల్ కొనసాగించాలని కోరుతున్నారు.

వసతి గృహం తరలింపు మానుకోవాలి..

సూర్యాపేటలోని శ్రీరాంనగర్‌లో ఉన్న బీసీ బాలికల వసతిగృహం వేరే చోటకు తరలింపును అధికారులు వెనక్కు తీసుకోవాలని డీఎస్‌ఓ జిల్లా కార్యదర్శి భాషపంగు సునీల్ డిమాండ్ చేశారు. శుక్రవారం బాలికల వసతి గృహం సందర్శించి మాట్లాడారు.

కలెక్టర్ ఉత్తర్వులు మేరకే..

ప్రభుత్వ నిబంధనల మేరకు వసతి గృహాన్ని మరో చోటుకు మార్చేందుకు కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారని బీసీ అభివృద్ధి అధికారి ఎస్తేర్ తెలిపారు. వసతి గృహం మారుస్తున్నందున విద్యార్థినులు వారం రోజులు వసతి గృహంలో ఉండేందుకు అవకాశం ఇవ్వమని కోరగా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

జీపీ కార్మికులపై ప్రభుత్వం మొండి వైఖరి

సూర్యాపేట రూరల్ : గత 23రోజులుగా తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని నిరవధిక సమ్మె చేస్తున్నా జీపీ కార్మికుల పట్ల ప్రభుత్వం మొండి వైఖరి వీడడంలేదని కేవీపీఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి కోట గోపి, మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు తలమళ్ల హస్సేన్ అన్నారు. శుక్రవారం గ్రామ పంచాయతీ కార్మికుల సమ్మెకు కేవీపీఎస్ ఆధ్వర్యంలో మద్దతు తెలిపి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీఐటీ యూ జిల్లా అధ్యక్షులు రాంబాబు, ధనియాకుల శ్రీనివాస్, రామచంద్రన్, సత్యనారాయణ, నర్సయ్య, నాగేందర్, నరసింహారావు పాల్గొన్నారు.

తిరుమలగిరి : గ్రామ పంచాయతీ కార్మికులను ప్రభుత్వం క్రమబద్ధీకరించాలని, వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని చేస్తున్న సమ్మె శుక్రవారం 23వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట గ్రామ పంచాయతీ కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బక్కయ్య, రాజు, యాకయ్య, వెంకన్న, శ్రీనివాస్, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

చివ్వెంల : తమను పర్మనెంట్ చేయాలని కోరుతూ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట పంచాయతీ కార్మికులు చేపడుతున్న సమ్మె శుక్రవారం కొనసాగింది. సమ్మెకు వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో సాగర్, ఈదయ్య, కృష్ణ, రాంబాబు, ఉప్పలయ్య, శంకర్, సురేష్, గోపాల్ పాల్గొన్నారు.

అర్వపల్లి : తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని కోరుతూ గ్రామ పంచాయతీ కార్మికులు ఎంపీడీఓ కార్యాలయం ఎదుట చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారం 23వ రోజు కొనసాగింది. సమ్మెలో కార్మికుల సంఘం మండల అధ్యక్ష, ఉపాధ్యక్షులు జీడి కృష్ణ, కన్నెబోయిన శ్రీశైలం, గుగులోతు నాగులునాయక్, చెరుకు శంకర్, యాకూబ్, ప్రవీణ్ పాల్గొన్నారు.

పెన్‌పహాడ్ : గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి బాదె నర్సయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయం ఎదుట జీపీ కార్మికులు చేస్తున్న సమ్మెకు ఆయన వినూత్నంగా పాటలు పాడి సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి రణపంగ కృష్ణ, గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ధనియాకుల శ్రీనివాస్, వెంకన్న, నర్సయ్య, మట్టయ్య, రమణయ్య, ముత్తమ్మ, రవి, శ్రీను పాల్గొన్నారు.


తిరుమలగిరిలో సమ్మెలో పాల్గొన్న గ్రామ పంచాయతీ కార్మికులు


చివ్వెంలలో..

వర్షాలకు దెబ్బతిన్న ప్రాంతాల పరిశీలన


సూర్యాపేట : బ్రిడ్జిని పరిశీలిస్తున్న డీఎస్పీ


తిమ్మాపురం వద్ద రోడ్డు పరిశీలిస్తున్న నాయకులు


నాగారం : వర్ధమానుకోటలోని మంచినీళ్ల చెరువును పరిశీలిస్తున్న అధికారులు

సూర్యాపేట రూరల్ : మూసీ ప్రాజెక్టు నుంచి గేట్ల ద్వారా నీటిని కిందకు విడుదల చేయడంతో వరద నీరు ఉధృతి పెరిగింది. దీంతో శుక్రవారం మండల పరిధిలోని వెదిరెవారి గూడెం వద్ద భీమారం బ్రిడ్జిపై నుంచి వరద నీరు ప్రవహిస్తోంది. ఫలితంగా వాహనాల రాకపోకలు నిలిపివేశారు. భీమారం బ్రిడ్జిని సూర్యాపేట డీఎస్పీ నాగభూషణం పరిశీలించారు. మిర్యాలగూడెం నుంచి సూర్యాపేటకు వచ్చే వాహనాలను భీమారం నుంచి కొప్పోలు, టేకుమట్ల మీదుగా సూర్యాపేటకు తరలిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రూరల్ సీఐ అశోక్‌రెడ్డి, ఎస్‌ఐ సాయిరాం, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నూతనకల్ : ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న రహదారులను పునర్నిర్మించాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చెవిటి వెంకన్న యాదవ్ ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం గుండ్లసింగారం బ్రిడ్జి వద్ద కొట్టుకపోయిన రోడ్డును యడవెల్లి, నూతనకల్ గ్రామాల మధ్య కోతకు గురైన రోడ్డును పరిశీలించారు. అనంతరం నీట మునిగిన పంట పొలాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షుడు నాగరిగారి ప్రీతం, జిల్లా మహిళా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు తిరుపగడ అనురాధ, అన్నెపర్తి జ్ఞానసుందర్, నాగం సుధాకర్ రెడ్డి, సర్పంచ్ తీగల కరుణశ్రీగిరిధర్‌రెడ్డి, కొల్లం కృష్ణారెడ్డి, జటంగి గణేష్, ముత్యం ప్రసాద్, మద్రు ప్రసాద్‌రావు, మహేశ్వరం చంద్రకళ, కోనం హిమతేజ్, కట్టా మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తిమ్మాపురం–సంగెం రోడ్డు..

అర్వపల్లి : మూడు మండలాల ప్రజలు నిత్యం రాకపోకలు సాగించే తిమ్మాపురం–సంగెం రహదారి పూర్తిగా దెబ్బతిని రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు అవుతున్నందున ప్రభుత్వం వెంటనే బీటీ రెన్యూవల్ చేయాలని టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి అన్నెపర్తి జ్ఞానసుందర్ డిమాండ్ చేశారు. తిమ్మాపురం వద్ద దెబ్బతిన్న రహదారిపై కాంగ్రెస్, సీపీఎం, వివిధ పార్టీల ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన తెలిపారు. ఈ రోడ్డు బీటీ పనులను వెంటనే ప్రారంభించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల మాజీ కార్యదర్శి ఎల్లంల అవిలయ్య, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు వేములకొండ ఉప్పలయ్య, మాజీ వైస్ ఎంపీపీ బొద్దు వెంకన్న, పీఏసీఎస్ డైరెక్టర్ మారం వెంకట్‌రెడ్డి, సిద్ది రాము యాదవ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మరమ్మతులు చేపట్టాలి..

మద్దిరాల : చెరువుకట్టకు మరమ్మతులు చేపట్టి రైతులను ఆదుకోవాలని దళిత విభాగం రాష్ట్ర అధ్యక్షుడు నాగరిగారి ప్రీతం, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చెవిటి వెంకన్న యాదవ్ అన్నారు. శుక్రవారం గుమ్మడవెల్లిలో చెరువు పూర్తిగా నిండి ప్రమాదకరంగా ప్రవహిస్తున్న అలుగును పరిశీలించారు. చెరువు కట్టకు గండిపడే ప్రమాదం ఉందని, గ్రామస్తులు ముందస్తుగా బస్తాల్లో మట్టిని నింపిన స్థలాన్ని వారు పరిశీలించారు. అనంతరం గ్రామంలో వర్షాలకు దెబ్బతిన్న పలువురి ఇళ్లలోకి వెళ్లి పరిశీలించారు. గ్రామానికి చెందిన 5వ, 13వ వార్డుల్లో బురదమయంగా మారడంతో బురదలోనే వరి నాట్లు వేసి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి అన్నెపర్తి జ్ఞానసుందర్, జిల్లా మహిళా అధ్యక్షురాలు అనురాధ కిషన్ రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి పచ్చిపాల వెంకన్న, పార్టీ మండల అధ్యక్షుడు ముక్కాల అవిలమల్లు, రేటినేని శ్రీనివాస్‌రావు, తాళ్లపెల్లి సురేష్‌గౌడ్, స్వప్న మహిపాల్‌రెడ్డి, హమీద్, బర్పటి ఉపేందర్, వినోద్, బత్తుల వెంకటేశ్వర్లు, మామునూరి ఉపేందర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పెన్‌పహాడ్ : వర్షాల వల్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేక అధికారి రాంపతి అన్నారు. శుక్రవారం అనాజిపురం, గాజులమల్కాపురం గ్రామాల్లో చెరువులను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శేషగిరిరావు, ఎంపీడీఓ బాణాల శ్రీనివాస్, ఐబీ డీఈ రమేష్, ఐబీ ఏఈ లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

చెరువును పరిశీలించిన అధికారులు

నాగారం : వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న భారీ వరదతో వర్ధమానుకోట గ్రామంలోని మంచాలకుంట (మంచినీళ్ల చెరువు) మత్తడి వద్ద గోడలు కూలిపోయి చెరువులోని నీరు బయటకి వెళ్తోంది. విషయం తెలుసుకున్న నీటిపారుదల శాఖ అధికారులు శుక్రవారం వెంటనే గ్రామానికి వెళ్లి చెరువును పరిశీలించారు. ఈ సందర్భంగా నీటిపారుదల శాఖ డీఈఈ పిచ్చియ్య మాట్లాడారు. చెరువులోని నీరు బయటకు వెళ్లకుండా తాత్కాలికంగా ఇసుక బస్తాలతో కట్టవేస్తామని తెలిపారు. మత్తడి గోడ నిర్మాణానికి రూ.2లక్షల నుంచి రూ.5లక్షల వరకు ఖర్చు అవుతుందని కలెక్టర్, నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరైన వెంటనే మత్తడి వద్ద గోడల నిర్మాణం పనులు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ గాలి శోభారాణి, ఎంపీఓ దార శ్రీనివాస్, బోయిని లింగమల్లు, మత్స్యశాఖ సొసైటీ అధ్యక్షుడు గుండు శ్రీనివాస్, బైరు భిక్షం, సైదులు, సోమయ్య, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

నష్టపోయిన పంటల పరిశీలన

తిరుమలగిరి : ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న పత్తి, వరి పంటలను శుక్రవారం తొండ గ్రామంలో వ్యవసాయ శాఖ అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి డి.వెంకటేశ్వర్లు మాట్లాడారు. అధిక వర్షాలకు రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. మొక్కల మధ్య నీళ్లు నిలువకుండా బయటకు పోయే విధంగా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ వెంకట్‌రెడ్డి, రైతుబంధు సమితి గ్రామ కోఆర్డినేటర్ వాసిరెడ్డి గోపాల్‌రెడ్డి, రైతులు గొలుసుల మల్లయ్య, సోమనారాయణ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పస్తాల రహదారిపై వంతెన నిర్మించాలి

నాగారం : వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు పస్తాల గ్రామం జల దిగ్బంధమైందని, పస్తాల స్టేజీ నుంచి గ్రామంలోకి వెళ్లే ప్రధాన రహదారిపై కల్వర్టు వద్ద ఉన్న బంధంపై వంతెన నిర్మించాలని ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యదర్శి బొజ్జ సైదులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పస్తాల గ్రామంలో నీరు ఉధృతంగా ప్రవహిస్తున్న బంధంను శుక్రవారం పరిశీలించి మాట్లాడారు. కల్వర్టు వద్ద నీరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో రాకపోకలు నిలిచిపోయి ప్రజలు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఆయనతో పాటు ఎమ్మార్పీఎస్ నాయకులు బొజ్జ రామకృష్ణ, ఆడెపు శ్రీరాములు, కండె సోమయ్య, బొజ్జ బజారు, వెంకట్, కూటికంటి నర్సింహ తదితరులు ఉన్నారు.

కూలిన ఇళ్ల పరిశీలన

నూతనకల్ : గత కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు వివిధ గ్రామాల్లో కూలిన ఇళ్లను తహసీల్దార్ ఎండీ. జమీరుద్దీన్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పురాతన ఇళ్లలో ప్రజలు నివసించకుండా సురక్షితమైన ప్రాంతాలకు వెళ్లాలని ఆయన సూచించారు. తాళ్లసింగారం, గుండ్లసింగారం, దిర్శనపల్లి, పెద నెమిల గ్రామాల్లో కూలిన ఇళ్లను పరిశీలించారు. ఆయన వెంట రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


తిరుమలగిరి : తొండ గ్రామంలో పత్తి చేలను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్లు


పెన్‌పహాడ్ : అనాజిపురంలో చెరువును పరిశీలిస్తున్న ప్రత్యేక అధికారి రాంపతి


గుమ్మడవెల్లిలో చెరువును పరిశీలిస్తున్న నాగరిగారి ప్రీతం, చెవిటి వెంకన్నయాదవ్


నూతనకల్ : తాళ్లసింగారంలో కూలిన ఇళ్లను పరిశీలిస్తున్న తహసీల్దార్ ఎండీ.జమీరుద్దీన్

జగదీష్‌రెడ్డిని మూడోసారి గెలిపించాలి


గడియారాలను పంచుతున్న అభినయ్

సూర్యాపేట : భవిష్యత్ తరాల కోసం మంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డిని మూడోసారి ఎమ్మెల్యేగా గెలిపించుకోవాలని 15వవార్డు కౌన్సిలర్ ఎలిమినేటి అభినయ్ అన్నారు. శుక్రవారం స్థానిక 15వ వార్డు బాలాజీ నగర్‌లో ఇంటింటికీ గోడ గడియారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ వార్డు అధ్యక్షుడు సకినాల జానయ్య, యూత్ విభాగం అధ్యక్షుడు ఉప్పు శ్రీకాంత్, దొనకొండ నరేష్, శ్రీకాంత్ రెడ్డి, నవీన్, గొడ్డేటి సందీప్, రమేష్, శివ పాల్గొన్నారు.

త్వరలో 'డబుల్' ఇళ్ల గృహ ప్రవేశాలు

కోదాడ : పట్టణ పరిధిలోని బాలాజీనగర్‌లో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్లల్లో లబ్ధిదారుల చేత త్వరలో గృహప్రవేశం చేయించనున్నట్లు మున్సిపల్ కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. శుక్రవారం వారు డబుల్ బెడ్‌రూం ఇళ్ల వద్ద మౌలిక వసతుల పనులను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ పట్టణంలో 560 డబుల్ బెడ్ రూం ఇళ్లను నిర్మించి వాటిని అర్హులైన వారికి పారదర్శకంగా అందించినట్లు తెలిపారు. ప్రస్తుతం ఇళ్ల వద్ద మౌలిక వసతులైన డ్రైయినేజీ, తాగునీటి సౌకర్యం పనులు ముమ్మరంగా సాగుతున్నాయని, త్వరలో పనులు పూర్తవుతాయని తెలిపారు. కార్యక్రమంలో చందు నాగేశ్వరరావు, కల్లూరి పద్మజ, కోట మధు, గుండెల సూర్యానారాయణ, కందుల చంద్రశేఖర్, మదార్, ఖదీర్, కట్టెబోయిన శ్రీను, అలవాల వెంకట్, వంటిపులి శ్రీను, స్వామినాయక్, అధికారులు సతీష్‌బాబు, రాము పాల్గొన్నారు.

ఐదెకరాల పొలం నీళ్ల పాలు

తిరుమలగిరి : తిరుమలగిరి మున్సిపాలిటీ పరిధిలోని మాలిపురం గ్రామానికి చెందిన సున్నం భిక్షం తన నాలుగు ఎకరాల సొంత పొలంతో పాటు ఒక ఎకరం కౌలుకు తీసుకొని ఐదు ఎకరాల్లో వరి నాట్లు వేశారు. కానీ గత మూడు రోజులుగా కురిసిన భారీ వర్షానికి వరద వచ్చి పొలం మొత్తం కొట్టుకపోయింది. దీంతో రైతు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. ఐదు ఎకరాలకు ఇప్పటికే రూ.70 వేల పెట్టుబడి అయ్యిందని వాపోయాడు. ప్రభుత్వమే నష్ట పరిహారం ఇచ్చి ఆదుకోవాలని కోరుతున్నాడు.


మాలిపురంలో నీటిలో మునిగిన పొలం

క్లుప్తంగా

నేడు సర్వసభ్య సమావేశం

తిరుమలగిరి : తిరుమలగిరి మండల సర్వసభ్య సమావేశాన్ని శనివారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఉమేష్‌చారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ సమావేశానికి ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ హాజరవుతారని తెలిపారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

నాగారం : నాగారం మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ కూరం మణివెంకన్న, ఎంపీడీఓ జి.శోభారాణి తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో వారు విలేకరుతో మాట్లాడారు. సమావేశానికి ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ హాజరవుతున్నట్లు తెలిపారు. సర్పంచ్‌లు, ఎంపీటీలు, అధికారులు పూర్తి సమాచారంతో హాజరుకావాలని కోరారు.

రుణమాఫీని అమలు చేయాలి


మాట్లాడుతున్న మందుల సామేలు

అర్వపల్లి : రైతులకు రుణమాఫీని వెంటనే అమలు చేయాలని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ మాజీ చైర్మన్ మందుల సామేలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం అర్వపల్లిలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రుణమాఫీ అమలు కాక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని చెప్పారు. తుంగతుర్తి నియోజకవర్గంలో రోడ్లు అధ్వానంగా మారాయని తెలిపారు. ఈ రోడ్లను వెంటనే మరమ్మతు చేయించాలని, బీటీ కాని రోడ్లను తారు రోడ్లుగా మార్చాలని విజ్ఞప్తి చేశారు. రుద్రమచెరువును రిజర్వాయర్‌గా మార్చుతామని హామీ ఇచ్చినా ఇంత వరకు అమలు కాలేదని విమర్శించారు. తిమ్మాపురం–సంగెం రహదారిపై వర్షాలకు వాగులు ప్రవహించి రాకపోకలు నిలిచిపోతున్నందున వంతెనలు నిర్మించాలని కోరారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తుంగతుర్తి నియోజకవర్గం నుంచి తాను తప్పనిసరిగా ఎమ్మెల్యే బరిలో ఉంటానని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో నాయకులు దిర్శనపు కృష్ణమూర్తి, రమేష్‌రెడ్డి, యాకస్వామి, యాదగిరి, చిరంజీవి, శ్రీను, సత్తయ్య, అంజి పాల్గొన్నారు.

సోమయ్య మృతికి సంతాపం

మద్దిరాల : మండల కేంద్రానికి చెందిన నెల్లుట్ల సోమయ్య ఇటీవల విద్యుదాఘాతంతో మృతి చెందాడు. దీంతో గిడ్డంగుల సంస్థ మాజీ చైర్మన్ మందుల సామేల్ శుక్రవారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట రాజు, నవీన్, సుబ్బు, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

వర్షానికి కూలిన ఇల్లు


కూలిన ఇంటి వద్ద బాధితురాలు ముత్తమ్మ

అర్వపల్లి : 10రోజులుగా కురుస్తున్న వర్షాలకు అర్వపల్లిలో మనుబోతుల ముత్తమ్మ అనే వృద్ధురాలి ఇల్లు శుక్రవారం కులిపోయింది. ఇల్లు కూలిన సమయంలో ఆమె ఇంటి బయట ఉండటంతో ప్రమాదం తప్పింది. ఇల్లు కూలడంతో ఇంట్లోని వస్తువులు పాడై సుమారు రూ.50వేల ఆస్తి నష్టం జరిగిందని బాధితురాలు తెలిపారు. ప్రభుత్వం పక్కా ఇంటిని నిర్మించాలని కోరుతున్నారు.

సంతోషిమాత ఆలయంలో ప్రత్యేక పూజలు


ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

భానుపురి : శ్రీసంతోషిమాత అమ్మవారి ఆశీస్సులతో ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఇమ్మడి సోమనరసయ్య తెలిపారు. శుక్రవారం సూర్యాపేట పట్టణంలోని శ్రీ సంతోషిమాత అమ్మవారి ఆలయంలో కుటుంబ సమేతంగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకుడు ఇటువంటి శివరామకృష్ణ శర్మ, ఆలయ అధ్యక్ష కార్యదర్శులు నూక వెంకటేశం గుప్త, బ్రాహ్మండ్లపల్లి మురళీధర్, కోశాధికారి పాలవరపు రాంమూర్తి, అన్నదాన నిర్వాహకులు పాల్గొన్నారు.

ఫీజుల చెల్లింపుపై హర్షం

తుంగతుర్తి : ఇతర రాష్ట్రాల్లోని విద్యాసంస్థల్లో చదివే బీసీ విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వమే పూర్తిస్థాయిలో ఫీజు చెల్లిస్తుందని సీఎం కేసీఆర్ నిర్ణయించడం హర్షణీయమని ఎంపీపీ గుండగాని కవితరాములు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో మాట్లాడారు. కేసీఆర్ ప్రకటన పట్ల రాష్ట్రంలోని వెనుకబడిన తరగతుల విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుందని అన్నారు.

మెస్ చార్జీల పెంపుపై..

గురుకుల, వసతి గృహాల్లో విద్యార్థులకు మెస్ ఛార్జీల పెంపు హర్షణీయమని బీఆర్ఎస్వీ నియోజకవర్గ అధ్యక్షుడు గునగంటి సంతోష్‌గౌడ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆయనతో పాటు బీఆర్ఎస్వీ నాయకులు ఉన్నారు.